క్లుప్తంగా

పశువులకు టీకాలు తప్పనిసరి



ఎద్దులకు టీకాలు వేస్తున్న దేవిదాస్

రాయికోడ్(అందోల్): మండలంలోని వివిధ గ్రామాల్లో పశువైద్యశాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం కొనసాగుతోంది. మండల పశువైద్య అధికారి డాక్టర్ పాండెన్ ఆధ్వర్యంలో సిబ్బంది దేవిదాస్, ఘనిలు శనివారం రామోజీపల్లిలోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. గ్రామంలోని ఎద్దులు, ఆవులు, గేదెలు, లేగదూడలకు వ్యాధి సోకకుండా ముందస్తుగా టీకాలు వేశారు. పశుపోషకులకు వ్యాధి నివారణ, వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించారు.

కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శించిన క్రాంతికిరణ్

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లో ఇటీవల మృతి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, ఆ పార్టీ రాష్ట్ర నాయకులు జైపాల్ రెడ్డితో కలిసి శనివారం పరామర్శించారు. అదే విధంగా నాగ్వార్, ఇటికేపల్లి, ఖాంజమాల్‌పూర్ గ్రామాల్లోనూ పలువురు కార్యకర్తల కుటుంబాలను పరామర్శించారు. కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అన్ని విధాల అండగా ఉంటుందని భరోసానిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు విఠల్, నాయకులు తుకారామ్, బసవరాజ్ పాటిల్, సంగమేశ్వర్ పాటిల్, రాజు, కృష్ణారెడ్డి, రాజు, మల్లేశం, అంజయ్య, సలీమ్, ఆయా గ్రామాల కార్యకర్తలు ఉన్నారు.

డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపుపై హర్షం



సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్న విద్యార్థులు

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ వసతిగృహ విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం పటాన్‌చెరు మండలం పెద్ద కంజర్ల గ్రామంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు సీఎం ఫొటో చూపుతూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2017 నుంచి ఇప్పటివరకు విద్యార్థుల కాస్మోటిక్, డైట్ చార్జీలు పెంచకపోవడంతో ఇబ్బందులకు గురైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా రీజినల్ కోఆర్డినేటర్ సుధాకర్, కళాశాల ప్రిన్సిపాల్ మహేశ్వరి మాట్లాడుతూ.. విద్యార్థులకు మంచి ఆహారం అందించడంతో ఆరోగ్యంగా ఉంటారని సూచించారు.

ఇంటి పన్ను కట్టాలి



రశీదు తీసుకుంటున్న సంగమేశ్వర్

మునిపల్లి(అందోల్): ప్రతి ఒక్కరూ ఇంటి పన్ను కట్టాలని పంచాయతీ కార్యదర్శి మహేందర్ కోరారు. శనివారం మండలంలోని మన్‌సాన్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఇంటి పన్నువసూళ్లు చేశారు. 2025 మార్చి 31వ తేదీ వరకు రూ. 57 వేల పన్ను వసూలు చేయాలని సంబంధిత అధికారులు టార్గెట్ ఇచ్చారన్నారు. ఇప్పటివరకు రూ.8 వేల వసూలైనట్లు తెలిపారు. ఇంటి పన్ను కట్టి రశీదు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బగిలి సంగమేశ్వర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం



నగదు అందజేస్తున్న యజమానులు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణ పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు టపాసుల దుకాణాల యజమానులు శనివారం సీఐ మహేశ్‌గౌడ్ సమక్షంలో రూ. 30 వేల నగదు అందజేశారు.

పారిశ్రామికవాడల్లో పార్కింగ్ కష్టాలు

- ఇటువైపు చూడని యాజమాన్యం
- రాత్రి వేళల్లో ప్రమాదకరంగా ప్రయాణం



రోడ్డుకు ఇరువైపులా నిలిపిన భారీ వాహనాలు

జిన్నారం(పటాన్‌చెరు): ఉమ్మడి మండలాల్లోని పారిశ్రామిక వాడల్లోని ప్రధాన రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సంవత్సరాలుగా పరిశ్రమల ఎదుట భారీ వాహనాల పార్కింగ్ చేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు.

భారీ వాహనాల పార్కింగ్

గుమ్మడిదల మండలాల్లోని పారిశ్రామికవాడల్లో ప్రధాన రహదారిపైనే భారీ కంటైనర్లు, లారీలు, నీటి ట్యాంకర్లు పెద్ద ఎత్తున పార్కి ంగ్ చేస్తున్నారు. దీంతో వాహనదారులకు సాఫీగా ప్రయాణించే వీలు లేకుండా పోతోంది. ఈ దారి గుండానే ప్రముఖ పుణ్యక్షేత్రం భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయానికి వెళ్లాల్సి ఉంటుంది. నిత్య ం రాకపోకలు సాగించే భక్తులకు వాహనాల పా ర్కి ంగ్‌తో అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రానీవిల్స్ పరిశ్రమ యాజమాన్యానికి ఎన్నోసార్లు హెచ్చరించిన తీరు మారడం లేదన్నారు.

పరిశ్రమల ఎదుట ..

పారిశ్రామికవాడలోని పద్మావతి, న్యూలాండ్, పరిశ్రమల ఎదుట దర్జాగా భారీ వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. ఇతరులకు ఇబ్బంది కలిగినా పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా గడ్డపోతారం పారిశ్రామికవాడలోని హెటీరో, లీ ఫార్మా, మైలాన్, దివిస్, బెనోవా ల్యాబ్ వంటి పరిశ్రమలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇంతా జరుగుతుంటే కొద్ది రోజుల క్రితమే లూసెంట్ అదే తీరున రోడ్డును ఆనుకుని పార్కింగ్ షెడ్డును ఏర్పాటు చేశారు. సరాక, వీర్కో డ్రగ్స్ తీరుపై గ్రామస్తులు పలుమార్లు హెచ్చరించిన యాజ మాన్యం మొండిగా వ్యవహరిస్తుంది. సంబంధిత అధికారులు పార్కింగ్ సమస్యను తక్షణమే పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డుపైనే పార్కింగ్



జిన్నారం నుంచి బొంతపల్లి పారిశ్రామికవాడలో పనిచేసేందుకు నిత్యం వందల మంది కార్మికులు ప్రయాణిస్తుంటారు. గ్రానీవిల్స్ పరిశ్రమకు వచ్చే కంటైనర్లు, లారీలు రోడ్డుకు ఇరువైపులా భారీ వాహనాలు నిలపడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పార్కింగ్ వల్ల ప్రమాదాలు జరిగిన ఘటనలు ఎన్నో ఉన్నాయి.

-శ్రీనివాస్ యాదవ్, జిన్నారం గ్రామస్తుడు

సమస్యను పరిష్కరించండి



నిత్యం పార్కింగ్ సమస్యతో తీవ్ర ఇక్కట్లు పడుతున్నాం. రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనాలపై ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తుంది. ఏళ్ల తరబడి మొరపెట్టుకున్న సమస్యకు పరిష్కారం లేదు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

-నారాబోయిన శ్రీనివాస్, గడ్డపోతారం,

గోమాత దర్శనంతో మానసిక ప్రశాంతత

- జ్యోతిర్‌వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకులు మహేశ్వర సిద్ధాంతి



ప్రసంగిస్తున్న మహేశ్వర సిద్ధాంతి

జోగిపేట(అందోల్): గోమాతను పూజించడం, దర్శనంతో జ్ఞానం, మానసిక ప్రశాంతత లభిస్తుందని జ్యోతిర్‌వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకులు మహేశ్వర సిద్ధాంతి అన్నారు. శనివారం జోగిపేటలోని శ్రీకృష్ణ గోశాల ద్వితీయ వార్షికోత్సవ వేడుకలకు ఆయన హాజరై ప్రసంగించారు. గోమాత దర్శనం నిత్య జీవితంలో ఒక భాగం కావాలని, ప్రతి గ్రామంలో గోశాల ఉన్నట్లయితే ఆ గ్రామానికి సకల సంపదలు కలుగుతాయని అన్నారు. ప్రతి ఇంటి ముందు గోమాత ఉంటే మంచిదన్నారు. గోవును పూజిస్తే.. సకల దేవతమూర్తులను ఆరాధించినట్లేనని, ప్రతి ఒక్కరూ రోజు గోమాతను దర్శించుకోవాలన్నారు. ఈ సందర్భంగా దంపతుల చేత ఉదయం దేవయజ్ఞం నిర్వహించారు. గోమాతలను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోశాలకు విచ్చేసిన ప్రముఖులు, సేవకులకు గోశాల నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరిని ఘనంగా సన్మానించి, గోమాత చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో గోశాల వ్యవస్థాపకుడు ఆకుల గోపాల్, కమిటీ అధ్యక్షుడు పురంలక్ష్మణ్, ప్రధాన సభ్యులు రవీందర్, మధు, వినయ్, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ భిక్షపతి, కౌన్సిలర్ సురేష్, శివశంకర్, మాజీ మార్కెట్ చైర్మన్‌లు ఎం.మల్లికార్జున్, డీబీ.నాగభూషణం పాల్గొన్నారు.

భక్తిభావంతో ఆలయాల నిర్మాణాలు



భక్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న స్వామిజీ

- శ్రీమాధవానంద సరస్వతీ స్వామిజీ

హత్నూర(సంగారెడ్డి): భక్తిభావంతో దేవాలయాల నిర్మాణానికి కృషి చేయాలని శ్రీమాధవానంద సరస్వతీ స్వామిజీ అన్నారు. శనివారం హత్నూరలోని పురాతన గణపతి, ఆంజనేయస్వామి దేవాలయాల పునర్నిర్మాణం, నూతనంగా నిర్మించిన రామాలయాన్ని మాధవానంద సరస్వతీ స్వామిజీ పరిశీలించారు. ఈ సందర్భంగా స్వామిజీ ప్రవచనాలు బోధించారు. గుర్తింపు కోసం, ఆర్భాటం కోసం ఆలయాల నిర్మాణానికి పూనుకోవద్దని భక్తిభావంతో ఆలయ నిర్మాణాలు చేపట్టాలన్నారు. నాది, నీది అనుకోకుండా గ్రామస్తులంతా ఐక్యంగా గణపతి ఆలయ నిర్మాణానికి సహకరించాలని సూచించారు. ఆలయాల నిర్మాణాలకు గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి ఎంతో కొంత సహాయం అందేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలన్నారు. భక్తిభావంతోనే మానసిక ప్రశాంతత నెలకొంటుందన్నారు.

వీరశైవ సాహిత్య సదస్సుకు రండి



కరపత్రం ఆవిష్కరిస్తున్న దృశ్యం

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని ఎడ్లబజార్ బసవేశ్వర మందిరంలో ఆదివారం నిర్వహించనున్న వీరశైవ సాహిత్య సదస్సుకు వీరశైవులందరు తరలిరావాలని అధ్యక్షుడు గందిగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ జయప్రకాష్ పిలుపునిచ్చారు. శనివారం మందిరంలో వీరశైవ సాహిత్య సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదివారం ఉ.9.30 నుంచి సా.5 గంటల వరకు నిర్వహించనున్న సాహిత్య సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు.

49మంది జూదరులపై కేసు

నారాయణఖేడ్: పట్టణం, మండలంలోని వివిధ గ్రామాల్లో జూదం ఆడుతున్న 49 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ విద్యాచరణ్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూదరుల నుంచి రూ. 94,920 నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. జూదం ఆడితే 8712661853 నంబర్‌కు ఫోన్ లేదా వాట్సాప్ ద్వారా సమాచారం ఇవ్వాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీపూజ



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న వ్యాపారులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పలు వ్యాపార దుకాణాల్లో శనివారం నిర్వహించిన లక్ష్మీపూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే మాణిక్ రావు పాల్గొన్నారు. దీపావళి పర్వదినం పురస్కరించుకుని వ్యాపార సంస్థల్లో పూజలు చేస్తుంటారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నారాయణ తదితర నాయకులు ఉన్నారు. అనంతరం ఎమ్మెల్యేను వ్యాపారులు సన్మానించారు.

సర్వేకు సన్నద్ధం



పట్టణంలో ఓ ఇంటికి అతికించిన స్టిక్కర్

నారాయణఖేడ్: ఈనెల 6 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం కానున్న సమగ్ర ఇంటింటి సర్వేకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇళ్లకు వచ్చే ఎన్యుమరేటర్లకు ఇబ్బందులు లేకుండా సిబ్బంది ముందస్తుగా ఇంటింటికీ తిరుగుతూ ఇళ్లకు మున్సిపాలిటీ పేరు, వార్డు నంబరు, ఇంటి నెంబరు, ఇంటి యజమాని వివరాలను స్టిక్కర్‌లో నమోదు చేసి ఇళ్లకు అతికించారు. సర్వేలో భాగంగా ఎన్యుమరేటర్లకు ప్రజలు సహకరించాలని కోరారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నిర్మలారెడ్డి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి, మద్దతు ధర పొందాలని టీజీఐఐసీ చైర్మన్ నిర్మల అన్నారు. శనివారం మండలంలోని కొల్కూర్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మలారెడ్డి మాట్లాడుతూ.. సన్నాలతో పాటు దొడ్డు ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు దళారులకు విక్రయించి నష్టపోవద్దన్నారు. జనవరి 1నుంచి రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు సన్న బియ్యాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ ప్రభు, తహసీల్దార్ సరస్వతి, ఏవో రమేష్, ఆర్ఐ గంగాధర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్దన్న , పట్టణ అధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ పీఏసీఎస్ మాణిక్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

గుమ్మడిదల మండలంలో..

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని కొత్తపల్లి, కానుకుంట గ్రామాల్లో సన్న, దొడ్డు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఐకేపీ ఆధ్వర్యంలో స్థానిక మాజీ ప్రజా ప్రతినిధులు శనివారం ప్రారంభించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ అధికారులు సూచించారు. కార్యక్రమంలో తాజా మాజీ ప్రజాప్రతినిధులు, వ్యవసాయ సహకార సంఘం ప్రతినిధులు ఐకేపీ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

సదాశివపేట(సంగారెడ్డి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగించుకోవాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ రత్నాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం వ్యవసాయ మార్కెట్ ఆవరణలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ సరస్వతి, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి ప్రారంభించారు.

డీసీఎంఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో..

సంగారెడ్డి : డీసీఎంఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో చౌటకూరు మండలంలోని ఆయా గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను చౌట్కూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నత్తి దశరథ్ ప్రారంభించారు. కార్యక్రమంలో శివలక్ష్మి , మల్లారెడ్డి , పత్తి రాములు, బాల్లగొండ, ఈశ్వర్ , శ్రీహరి, గోవర్ధన్, రైతులు పాల్గొన్నారు.

కులగణనతో సామాజిక న్యాయం

- టీజీ ఐఐసి కార్పొరేషన్ చైర్మన్ నిర్మల



ఇంటింటి సర్వే పత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

సంగారెడ్డి : సమగ్ర కులగణనతో సామాజిక న్యాయం చేకూరుతోందని టీజీఐఐసీ చైర్మన్ నిర్మల అన్నారు. శనివారం సంగారెడ్డి పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో సమగ్ర ఇంటింటి సర్వేపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ న్యాయం జరగాలంటే కులగణన, కుటుంబ సమగ్ర సర్వే పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సర్వే, బీసీ కులగణనతో బీసీలకు అన్ని అంశాల్లో అవకాశాలు మెరుగుపడతాయన్నారు. అనంతరం నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, నీలం మధు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సర్వేలో సేకరించిన వివరాలతో ప్రజల ఆర్థిక పరిస్థితిని అంచనా వేయొచ్చన్నారు. దీంతో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందించవచ్చని చెప్పారు. బీసీ కులగణన తర్వాత బీసీలకు రిజర్వేషన్లు పెరిగి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, పీసీసీ అధ్యక్షుల నిర్ణయంపై ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, నాయకులు గాలి అనిల్‌కుమార్, తోపాజీ అనంతకిషన్, మాజీ ఎంపీపీ ఆంజనేయులు, రాజు, శ్రీనివాస్‌రెడ్డి, పుష్ప నగేష్‌యాదవ్, వివిధ మండల బ్లాక్ అధ్యక్షుడు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఘనత కేసీఆర్‌దే

- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు గోవర్ధన్ రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): రైతన్నలు పండించిన వరి ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించే పద్ధతికి శ్రీకారం చుట్టిన ఘనత మాజీ సీఎం కేసీఆరేకే దక్కుతుందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు గోవర్ధన్ రెడ్డి అన్నారు. శనివారం గుమ్మడిదలలో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుత ప్రభుత్వం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. దళారులను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లోని విక్రయించాలని సూచించారు. పది సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో రైతన్నకు అన్ని విధాల అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిలిచిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.



న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్‌లో శనివారం వేకువ జామున అధికంగా పొగమంచు కమ్ముకోవడంతో వాహనచోదకులు అవస్థలు పడ్డారు. ఉ.8 గంటల వరకు పొగమంచు రోడ్లను కమ్మేసింది. దీంతో వాహనచోదకులు పగలే లైట్లు వేసుకొని ప్రయాణం సాగించారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం



అగ్ని ఆహుతైన ఇంటిని పరిశీలిస్తున్న చంద్రారెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): దీపావళి పండుగ వేళ ఓ పేద కుటుంబంలో అపశృతి చోటుచేసుకుంది. బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని మల్లన్న బస్తీలో నివసించే మున్నాయాదవ్ ఇల్లు ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న బొల్లారం మున్సిపల్ కౌన్సిలర్ చంద్రారెడ్డి మున్నాయాదవ్ కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని చంద్రరెడ్డి హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబానికి నష్టపరిహారాన్ని అందజేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాజు స్థానికులు శేఖర్ వర్మ పద్మ ధనుంజయ్ మెట్టు యాదవ్ బీనయి కమలేష్ అజయ్ బస్తీ వాసులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ భక్తితోనే ముక్తి

మునిపల్లి(అందోల్): భక్తితోనే ముక్తి లభిస్తోందని అంతారం జీవన్ముక్త సంస్థాన పీఠాధిపతి జ్ఞానేశ్వర్ మహారాజ్ భక్తులకు ఉపదేశించారు. శనివారం మండలంలోని అంతారం జీవన్ముక్త సంస్థానంలో పలువురు భక్తులకు కరపత్రాలు అందజేశారు. ఈ నెల 25న నుంచి 29 వరకు ఉత్సవాలు జరగనున్నాయని తెలిపారు. ఆయా గ్రామాల్లో ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేయాలని భక్తులను కోరారు. కార్యక్రమంలో మల్లన్న పటేల్‌తో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

◆ చెట్లు నరికిన వారిపై చర్యలు

మునిపల్లి(అందోల్): ప్రభుత్వ పాఠశాలలో టేకు చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని చీలపల్లి గ్రామానికి చెందిన నాగేశ్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని నాగేష్ ఎంపీడీఓ హరినందన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. 20 సంవత్సరాలుగా టేకు చెట్లు ప్రభుత్వ పాఠశాలలో ఉన్నాయని, వాటిని నరికి వేయడం దారుణమన్నారు.

◆ ప్రభుత్వ భూములు కాపాడండి

సంగారెడ్డి జోన్: పట్టణంలోని రాంచందర్‌రెడ్డి నగర్ కాలనీలోని 403 సర్వే నంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూములను కాపాడాలని బీజేపీ నాయకుడు కొండాపురం జగన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కొందరు ప్రభుత్వ భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు ఉన్నారు.

◆ కొత్త మిషన్లతో తంటాలు

జిన్నారం (పటాన్‌చెరు): మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ వార్డు సభ్యుడు శ్రీనివాస్ యాదవ్ సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు నూతనంగా వాడుతున్న మిషన్ సక్రమంగా పనిచేయడం లేదని తన దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. నూతన మిషన్ వాడకంతో చాలా సమయం వృథా అవుతుందన్నారు. పాత మిషన్లపైనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలన్నారు. రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని ఐకేపీ అధికారులకు సూచించారు.

◆ చెక్‌పోస్టు ఏర్పాటు



నారాయణఖేడ్: నాగల్‌గిద్ద మండలంలోని కరస్‌గుత్తి క్రాస్‌రోడ్డులో శనివారం పోలీసులు చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. మార్కెటింగ్, పోలీసుశాఖ సంయుక్తంగా ఈ చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వరికొనుగోలు కేంద్రాలు రాష్ట్రంలో ప్రారంభమైన దృష్ట్యా కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి ఇక్కడికి వరిధాన్యం తరలించకుండా ముందస్తు చర్యల్లో భాగంగా చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఎన్నికల సమయంలో కొనసాగిన చెక్‌పోస్టును తాత్కాలికంగా నిలిపివేశారు.

◆ టీటీడీ చైర్మన్‌కు సన్మానం



నారాయణఖేడ్: ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానం నూతన చైర్మన్‌గా నియమితులైన బీఆర్.నాయుడును శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట సంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సృజన్‌పటేల్, న్యాల్‌కల్ మాజీ జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, నాయకులు హన్మంత్‌రావు పాటిల్, అశోక్, శుక్లవర్ధన్‌రెడ్డి ఉన్నారు.

◆ క్రీడల్లో రాణించాలి : సీఐ

సంగారెడ్డి : విద్యార్థులు క్రీడలతో పాటు చదువులో రాణించాలని జోగిపేట సీఐ అనిల్‌కుమార్ కోరారు. శనివారం చౌటకూర్ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో పుల్‌కల్, చౌటకూర్, వట్టిపల్లి, అందోల్ మైనార్టీ విద్యార్థులకు కబడ్డీ, కోకో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ కష్టారెడ్డి, ఉపాధ్యాయులు మోహన్‌రెడ్డి, ఎస్సై క్రాంతి కుమార్ పాటిల్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ ఎమ్మెల్సీ అలీఖాన్‌కు సన్మానం

జహీరాబాద్ టౌన్: ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్‌ను కాంగ్రెస్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు శనివారం సన్మానించారు. హైదరాబాద్ నుంచి సోలాపూర్ వెళ్తున్న ఆయన జహీరాబాద్‌లో కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు రాములునేత, జహంగీర్, మోతిరాం ఆయనను కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు.

◆ సర్వేకు సహకరించడండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ప్రణాళికబద్ధంగా ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. తెల్లాపూర్ మున్సిపాలిటీతో పాటు తాజాగా మున్సిపల్‌లో విలీనమైన గ్రామాల్లో సైతం సర్వే నిర్వహిస్తున్నట్లు వివరించారు. అందుకు 189టీంలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు.

◆ పట్టణానికి దూరంగా రోడ్డు విస్తరణ చేపట్టాలి

నారాయణఖేడ్: జాతీయ రహదారి నిర్మాణం వల్ల ఇల్లు, ప్లాట్లకు నష్టం కలుగకుండా పట్టణానికి కొద్ది దూరం నుంచి నిర్మించాలని పలువురు బాధితులు శనివారం నారాయణఖేడ్ ఆర్డీఓ అశోక చక్రవర్తికి మొరపెట్టుకున్నారు. నిజాంపేట, ఖేడ్, బీదర్ 161బీ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఖేడ్ పట్టణంలో నుంచి వంతెనను నిర్మించనుండటంతో 15 భవనాలు, 400 వరకు ఇళ్లస్థలాలకు నష్టం జరుగుతుందని తెలిపారు. ఖేడ్ పట్టణంలోంచి రెండు బైపాస్‌రోడ్లు ఉన్నందున ట్రాఫిక్ సమస్యలు అంతగా ఉండవని పేర్కొన్నారు. ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో కాకుండా పక్కనుంచి నిర్మించాలని మున్సిపల్ పాలకవర్గం చేసిన తీర్మానాన్ని సైతం ఆర్డీఓకు అందజేశారు.

◆ సగరులు స్పష్టమైన వివరాలు ఇవ్వాలి

జహీరాబాద్ టౌన్: సమగ్ర కులసర్వేలో సగరులు స్పష్టమైన వివరాలు ఇవ్వాలని సగర సంఘం జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ అధికారులు సమగ్ర కుల సర్వే కోసం వచ్చిన సందర్భంగా అన్ని వివరాలు అందజేయాలన్నారు. ఈ మేరకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటయ్య, జిల్లా కోశాధికారి అభిశెట్టి ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు శంకర్ సగర, నాయకులు తుక్కన్న, మల్లేశం, శ్రీనివాస్, ప్రవీణ్ పాల్గొన్నారు.